క్లుప్తంగా

రోడ్డు సౌకర్యం కల్పించాలని కేంద్ర మంత్రికి వినతి


కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సంతోష్‌నాయక్

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో జనగామ–వరంగల్ జిల్లాలను కలిపే నెల్లిబండ తండా వద్ద రోడ్డు సౌకర్యం కల్పించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డికి భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు ధరావత్ సంతోష్‌నాయక్ సోమవారం ఢిల్లీలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాను కలిపేలా నెల్లిబండ తండా – నీలిబండ తండా రోడ్డుకు గతంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.75 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. వెంటనే నిధులు విడుదల చేసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాగారం : మండల పరిధిలోని పసునూర్ మోడల్‌స్కూల్‌లో అవర్లీబేసిక్ పద్ధతిలో వృక్షశాస్త్రం సబ్జెక్టును బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కుంట రమేష్‌కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదర్శ పాఠశాలలో 9 నుంచి ఇంటర్ వరకు వృక్షశాస్త్రం బోధించడానికి అర్హులైన వారు ఈ నెల 27వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు బీఈడీ, పీజీ సబ్జెక్టులలో 50శాతం మార్కులు కలిగి ఉండాలని, వారికి 28న డెమో క్లాస్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గ్రీవెన్స్ డేను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ అమీన్‌సింగ్

మద్దిరాల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. సోమవారం ఆయా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, ఏఓ వికాస్‌పాటిల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అఖిల్, ఏపీఎం మైసయ్య పాల్గొన్నారు.

గడువులోగా సీఎంఆర్ ఇవ్వాలి


మునగాలలోని ఓ రైస్‌మిల్లులో తనిఖీ చేస్తున్న ఆర్డీఓ, రెవెన్యూ సిబ్బంది

మునగాల : మిల్లర్లు గడువులోగా సీఎంఆర్ ఇవ్వాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన మునగాల మండల కేంద్రంలోని నాగార్జున, శ్రీబాలాజీ పార్‌బాయిల్డ్, మహాలక్ష్మి మిల్లులను స్థానిక రెవెన్యూ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఆయా మిల్లుల్లో రికార్డులు, స్టాకులను పరిశీలించారు. అనంతరం మాటాడుతూ ఈ నెల 29లోగా మిల్లర్లు ప్రస్తుత యాసంగి సీజన్‌లో కేటాయించిన సీఎంఆర్‌ను ఇవ్వాలని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ వలిగొండ ఆంజనేయులు, గిర్దావర్ రామారావు, సిబ్బంది ఉన్నారు.

ఆదర్శ పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనాజిపురం ఆదర్శ పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్స్ తీసుకుంటున్నట్లు ప్రిన్సిపల్ ప్రమీల సోమవారం తెలిపారు. 6వ తరగతిలో 30సీట్లు, 7వ తరగతిలో 20సీట్లు, 8వ తరగతి 15సీట్లు, 9వ తరగతిలో 10సీట్లు, 10వ తరగతిలో 10సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు టీసీ, స్టడీ కండక్ట్, ఆధార్ జిరాక్స్, రెండు పాస్‌ఫొటోలు తీసుకొని పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో పరిమిత సీట్లు ఉన్నాయని, పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు వెంటనే సంప్రదించాలని కోరారు.

మృతురాలి కుటుంబానికి పలువురి పరామర్శ

నాగారం : ఫణిగిరి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బత్తుల రమేష్ మాతృమూర్తి బత్తుల లలిత అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం మృతురాలి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో రాంరెడ్డి, పానుగంటి నర్సింహారెడ్డి, లింగయ్య, గట్టు లక్ష్మీకాంత్, వీరమల్లు, సత్తయ్య, శేఖర్‌రెడ్డి, రమేష్, కర్ణాకర్, రవి, భాస్కర్, రవికుమార్, లింగయ్య, మహేష్ తదితరులు ఉన్నారు.

పల్లె పాలనకు భవనాల కొరత

- తుంగతుర్తి మండలంలోని పలు జీపీలకు సొంత భవనాలు కరువు
- అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య కొనసాగుతున్న కార్యాలయాలు
- కొన్ని గ్రామాల్లో సొంత భవనాలు ఉన్నా వర్షాలకు కురుస్తున్న పైకప్పులు


సంగెంలో శిథిలావస్థకు చేరిన జీపీ భవనం


బందరామారంలో దెబ్బతిన్న భవనం గోడలు

తుంగతుర్తి : మండల పరిధిలోని పలు గ్రామాల పంచాయతీ కార్యాలయాలకు సరైన భవనాలు లేకపోవడంతో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తుంగతుర్తిలో మండలంలో మొత్తం 24 గ్రామపంచాయతీలు ఉన్నాయి. వీటిలో 12 జీపీలు పాతవి కాగా, 12 నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. పాత వాటిలో సంగెం, బందరామారం, తుంగతుర్తి, వెలుగుపల్లి గ్రామ పంచాయతీలకు సంబంధించిన భవనాలు శిథిలావస్థకు చేరి కూలేదశలో ఉన్నాయి. ముఖ్యంగా సంగెం, బందరామారం గ్రామాల జీపీలు పూర్తిగా శిథిలమై ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొన్నది. దీంతో ఆయా గ్రామాల పంచాయతీ భవనాల్లో అధికారులు భయాందోళనతో పాలన సాగిస్తున్నారు. ఇక కొత్తగా ఏర్పాటైన 12 జీపీలలో దేవునిగుట్టతండాకు మాత్రమే నూతన భవనం మంజూరైంది. ఇది ప్రస్తుతం నిర్మాణ దశలో ఉండగా, మరో మూడు జీపీ కార్యాలయాలు ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇక మిగతా 8జీపీలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రస్తుతం అద్దె భవనాల్లో కొనసాగుతున్న జీపీలలో మౌలిక వసతులు కరువై ప్రజలు, అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అరకొర వసతులు..

మండలంలోని పలు జీపీలకు సొంత భవనాలు ఉన్నా అవి ఇరుకు గదులు కావడంతోపాటు శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో కురుస్తున్నాయి. దీంతో కార్యాలయాల్లోని విలువైన రికార్డులను భద్రపర్చడం సిబ్బందికి ఇబ్బందిగా మారింది. ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, పలు పనుల నిమిత్తం వచ్చే ప్రజలు జీపీ కార్యాలయాల్లో మౌలిక వసతులు లేక అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన జీపీలతో పాటు శిథిలావస్థలో, ఇరుకు గదుల మధ్య నడుస్తున్న పాత జీపీలకు కూడా నూతన భవనాలు మంజూరు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భవనం మంజూరు చేయాలి



గ్రామపంచాయతీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గ్రామానికి నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మంజూరి చేయాలి.

– ఏశమల్ల సుశీల, మాజీ సర్పంచ్, సంగెం

హాస్టల్‌కు ప్రహరీ నిర్మించాలని వినతి


వినతిపత్రం అందిస్తున్న విద్యార్థులు

భానుపురి : జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద ఎస్సీ బాలికల హాస్టల్‌కు ప్రహరీ నిర్మించాలని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు విద్యార్థులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి మాట్లాడారు. నాలుగేళ్లుగా ప్రహరీ నిర్మించకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ప్రహరీ లేకపోవడంతో ఆకతాయిల కారణంగా విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే గోడ నిర్మించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ డివిజన్ ప్రధాన కార్యదర్శి భరత్, హాస్టల్ విద్యార్థినులు స్వప్న, లావణ్య, కవిత, సౌజన్య, స్వాతిక తదితరులు పాల్గొన్నారు.

విద్యాబుద్ధులు నేర్పిన గురువుల స్థానం పదిలం


శెనిగల యాదగిరి దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, తదితరులు

నూతనకల్ : విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుల స్థానం ఎల్లప్పుడూ విద్యార్థుల హృదయాల్లో పదిలంగా ఉంటుందని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం తాళ్లసింగారం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శెనిగల యాదగిరి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఉద్యోగికి స్థాన చలనం, ఉద్యోగ విరమణ తప్పనిసరి అని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్ది వారిని ఉన్నత స్థాయికి చేర్చడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందుతున్న శెనిగల యాదగిరి–పద్మ దంపతులను ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి రాములు నాయక్, మాజీ సర్పంచ్ చూడి లింగారెడ్డి, పన్నాల సైదిరెడ్డి, మట్టపల్లి గంగయ్య, చేపూరి శ్రీనివాస్‌రెడ్డి, వీరస్వామి, జానకిరాములు పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూర్(ఎస్) : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు అన్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు పాత సూర్యాపేట, ముక్కుడుదేవులపల్లి, ఏపూరు గ్రామాల్లో ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.27,000లుగా నిర్ణయించి అమలు చేయాలన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. సింగరేణి బొగ్గు గనుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సామ నర్సిరెడ్డి, తలకొప్పుల ఎల్లయ్య, మంగయ్య, నెమ్మాది ఎల్లయ్య, వెంకన్న, మల్లయ్య, నర్సక్క, సుగుణ, వెంకటమ్మ, పద్మ, గీత, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తిమ్మాపురంలో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్ 2012–13 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. 12 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, లింగాల రవి, వసిఉల్లా, వెంకటేశ్వర్లు, చైతన్య, రాణి, పద్మజ, పూర్వద్యార్థులు బొడ్డు నాగరాజు, బూర్గుల నాగరాజు, బొడ్డు అనిల్, బింగి రవి, ఆకారపు మహేష్, ఎస్.మహేష్, షరీఫ్, సైదిరెడ్డి, గోగుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోట పరిశీలన


తుంగతుర్తిలో ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

తుంగతుర్తి : ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఆయిల్‌పామ్ కంపెనీ డీజీఎం యాదగిరి అన్నారు. మండల కేంద్రంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సాగుచేసిన ఆయిల్‌పామ్ తోటను సోమవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగులో తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఆయిల్ పామ్ తోటలను సాగుచేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీ సన్న చిన్న కారు రైతులకు 90శాతం, ఇతర కేటగిరి రైతులకు 80శాతం రాయితీ ఉంటుందని అన్నారు. ఆయిల్‌పామ్ తోట నాటిన నాలుగు సంవత్సరాల నుంచి దిగుబడి వస్తుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఉద్యానవన శాఖకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి పి. స్రవంతి, హరీష్, అశోక్, భద్రాచలం, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులు

అర్వపల్లి : తుంగతుర్తి నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నికను సోమవారం రామన్నగూడెంలోని కల్వరి ప్రేమప్రార్థన మందిరంలో నిర్వహించారు. నియోజకవర్గంలోని 9మండలాల నుంచి హాజరైన పాస్టర్స్ ఈ కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా కేలోతు చంద్రశేఖర్, అధ్యక్షుడిగా జిల్లా శ్యాంసన్, ఉపాధ్యక్షులుగా విలియం కేరి, శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కాపర్తి సైమన్, సహాయ కార్యదర్శులుగా కె.బాపు, జి.జాషువా, కోశాధికారిగా కోట యాకోబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.కిరణ్‌పాల్, చైర్మన్‌గా ఆర్.ప్రభుకుమార్, ముఖ్య సలహాదారుగా ఇరుగు సంసోన్, ఎన్నికల కమిటీ చైర్మన్‌గా ప్రేమ్‌సాగర్, సభ్యులుగా అబ్రహం, శ్యాంబాబు, రఘుయేలు, గౌరవ సలహాదారులుగా ప్రభుదాస్, దామోదర్‌పాల్, తిమోతి, దానియేలు, జీవరత్నం, జార్జి, కన్వీనర్లుగా బర్నబాస్, జాన్, అబ్రహం, వాసు, కార్యవర్గసభ్యులుగా దానియేలు, సీమోను, దేవదానం, యేషే, ఎజ్రా, వెంకన్న, సురేష్, మురళి, యాకోబును ఎన్నుకున్నారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలి


కాసర్లపహాడ్ ప్రాథమిక పాఠశాలలో నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

అర్వపల్లి : ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని కాసర్లపహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.నర్సింహాచారి కోరారు. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన బచ్చు నర్సయ్య జ్ఞాపకార్థం అతడి కుమారుడు, సూర్యాపేట అయ్యప్ప స్వామి దేవాలయం ట్రెజరర్ బచ్చు శ్రీనివాస్ సోమవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు రూ.10వేల విలువ చేసే నోట్ పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను సమకూర్చారు. వాటిని సోమవారం పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెచ్‌ఎం సోమయ్య, ఉపాధ్యాయుడు దబ్బేటి యాదగిరి, అంగన్‌వాడీ టీచర్ లింగంపల్లి రేణుక తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చేది కాంగ్రెస్ పార్టీయే

- ఎమ్మెల్యే మందుల సామేల్


నూతనకల్ : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్


మద్దిరాలలో మృతురాలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సామేల్, తదితరులు


అర్వపల్లిలో మాట్లాడుతున్న మందుల సామేల్

నూతనకల్ : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేది కాంగ్రెస్ పార్టీయే అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్ సభలో రాహుల్ గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్ ప్రకారం రూ. 2లక్షల రుణమాఫీకి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. నియోజకవర్గంలో శిథిలమైన రహదారుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశామని తెలిపారు. ప్రధానంగా నూతనకల్ నుంచి తుంగతుర్తి మండలం సంగెం, సంగెం నుంచి అర్వపల్లి మండలం తిమ్మాపురం వరకు రూ.32కోట్ల వ్యయంతో రోడ్ల నిర్మాణ పనులకు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని టీపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ముఖ్యమంత్రితో మాట్లాడి స్కావెంజర్ల నియామకం కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ, ఎంపీటీసీ పన్నాల రమమల్లారెడ్డి, మాజీ ఎంపీపీ గోరుగంటి మోహన్‌రావు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, మద్దిరాల, తిరుమలగిరి, అడ్డగూడూరు మండలాల పార్టీ అధ్యక్షులు ముక్కాల అవిలమల్లు, నరేష్, లింగయ్య, నకిరేకంటి వెంకన్న, మధు, గుగులోతు కృష్ణ, పాల్వాయి నాగరాజు, జనార్దన్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

గ్యారంటీలను అమలుచేసి తీరుతాం

అర్వపల్లి : ఆరు గ్యారంటీలను అమలుచేసి తీరుతామని ఎమ్మెల్యే సామేల్ అన్నారు. సోమవారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీ సాహసోపేత నిర్ణయమని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయించి అన్ని సమస్యలను పరిష్కరించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి మధుకర్‌రెడ్డి, దాసరి సోమయ్య, బైరబోయిన మహారాజు, అలువాల వెంకటస్వామి, పందిరి సురేందర్, దిర్శనపు కృష్ణమూర్తి, మందడి పూర్ణచంద్రారెడ్డి, కుదురుపాక ఉదయ్, కొమారి మల్లయ్య, కుంకుడుపాల రవి, పందిరి యాదగిరి, ధనుంజయ్, మాదగాని విక్రమ్, వనం రమేష్, దొరెపల్లి మధు, సైదులు, సమ్మయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

మద్దిరాల : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎల్లు అశోక్‌రెడ్డి నాయనమ్మ ఎల్లు నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఎమ్మెల్యే మందుల సామేల్ సోమవారం మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పెదూరి అశోక్ ఇటీవల మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మార్త కృష్ణమూర్తి, పాక అమృతమల్లు, చామకూరి శ్రీనివాస్, ఎల్లు శివారెడ్డి, ఎల్లు అశోక్‌రెడ్డి, భూతం చల్లం, వల్లపు రమేష్, నలమాస ఉపేందర్, సుల్తాన్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ నిర్ణయం హర్షణీయం

నాగారం : సీఎం రేవంత్‌రెడ్డి రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పసుపులేటి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు రుణమాఫీ సాహసోపేత నిర్ణయమన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో రుణమాఫీ చేయడకుండా నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్‌పార్టీ నాయకులు వడ్డే యాదగిరి, పిన్నమరెడ్డి సోమిరెడ్డి, శీల కృష్ణమూర్తి, లింగమల్లు, ఉప్పలయ్య తదితరులు ఉన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ


విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న పులిగిల్ల లింగయ్య యాదవ్

మద్దిరాల : విద్యార్థులు కష్టపడి చదివితే విజయం తలవంచక తప్పదని కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పులిగిల్ల లింగయ్య యాదవ్ అన్నారు. సోమవారం జి.కొత్తపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత సతీష్, సాయి, అన్వేష్, మధు, మహేందర్, యాకన్న, తదితరులు పాల్గొన్నారు.

28న సర్వసభ్య సమావేశం

పెన్‌పహాడ్ : ఈ నెల 28న ఎంపీపీ నెమ్మాది భిక్షం అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. మండలంలోని సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

స్థల పరిశీలన

అనంతగిరి : ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించేందుకు స్థల పరిశీలన చేసినట్లు ఆర్డీఓ సూర్యనారాయణ తెలిపారు. సోమవారం అనంతగిరి మండల కేంద్రంలోని సర్వే నంబర్ 1470లోని ప్రభుత్వ భూమిలో తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయం నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించారు. ప్రతిపాదనలు సిద్ధంచేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. సదరు సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రవికుమార్, సర్వేయర్ కనకారావు ఉన్నారు.

రైతుల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం


తుంగతుర్తిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తుంగతుర్తి : రైతుల సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ జిల్లా ఎస్సీసెల్ నాయకుడు చింతకుంట్ల వెంకన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మాట్లాడారు. ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. నియోజకవర్గానికి సుమారుగా 3,500 ఇందిరమ్మ ఇళ్లు రానున్నట్లు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, బొంకూరి సుమన్, కటకం సూరయ్య, కటకం వెంకటేశ్వర్లు, కటకం కిష్టయ్య, రమేష్, యాకయ్య, భాస్కర్, రంజిత్, నాగయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సత్ఫలితాలు ఇచ్చిన 'బడి బాట'

- ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన ప్రవేశాలు
- తిరుమలగిరి మండలంలో కొత్తగా 357 మంది చేరిక


తొండ గ్రామంలో బడి బాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు (ఫైల్)

తిరుమలగిరి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమానికి తిరుమలగిరి మండలంలో విశేష స్పందన లభించింది. ఈ ఏడాదికి గానూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయి. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల మోతతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు ఉన్న ఊరులోని ప్రభుత్వ పాఠశాలలకే తమ పిల్లలను పంపించేందుకు సిద్ధమవడం గమనార్హం. తిరుమలగిరి మండలంలో ఇప్పటి వరకు కొత్తగా 357 మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు.


ఇంటింటికీ వెళ్లి ప్రచారం..

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలను పెంచేందుకు జూన్ 6 నుంచి 19 వరకు బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పిల్లల తల్లిదండ్రులను కలిశారు. గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలు, గతంలో విద్యార్థుల ర్యాంకుల వివరాలతో కూడిన కరపత్రాలను ముద్రించి పంచారు. నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలను విస్తృతంగా ప్రచారం చేశారు.

సమకూరుతున్న వసతులు..

సర్కారు బడుల్లో సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకాన్ని అమలు చేస్తోంది. దీని ద్వారా పాఠశాలల్లో వసతులు సమకూరుస్తున్నారు. విద్యార్థులకు యూనిఫాం, ఉచితంగా పాఠ్యపుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. మొత్తానికి ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల అడ్మిషన్లు ఆశించిన స్థాయిలో పెరిగాయని ఉపాధ్యాయులు తెలుపుతున్నారు.

ప్రణాళికతో ముందుకెళ్లాం



బడి బాట కార్యక్రమాన్ని ప్రణాళికతో విజయవంతంగా నిర్వహించడంతో ఈసారి మండలంలో ప్రవేశాలు పెరిగాయి. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత ఉన్న ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన అందుతుంది. చక్కటి వసతులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రవేశాల ప్రక్రియ మరికొన్ని రోజులు కొనసాగుతుంది.

– ఐ.శాంతయ్య, మండల విద్యాధికారి